మినీ కథ




# అర తెరచిన గుప్పిట

గంగుల నరసింహారెడ్డి

**అనగా** అనగా కాదు ఈ కాలంలోనే ఒక సంపన్న దేశాన్ని ఒక మహా రాజు పరిపాలిస్తున్నాడు. ఆ రాజుకు ఒక్కడే కొడుకు. ఎంతో అందగాడు.

యువరాజుకు యుక్త వయస్సు వచ్చేసింది. అటువంటి సంపన్న దేశపు అందాల రాకుమారుడి కొరకు చాలామంది ఆడపిల్లలు కలలతో కలవర పడ్డారు. ఎందరో తల్లి దండ్రులు ఆశతో ఉబలాట పడ్డారు. కాని, ఆశ్చర్య కరమైన విషయమేమంటే రాకుమారుడు పెళ్ళంటే ఎంతో విముఖతను ప్రదర్శిస్తున్నాడు. ఎందరో అందగత్తెల ఫోటోలను చూసి విసిరేస్తున్నాడు. "నా కప్పుడే పెళ్ళొద్దు" అంటున్నాడు.

"ఏ తోటమాలి కూతురునో యువరాజు ప్రేమించ లేదు కద" అనే అనుమానంతో రాజు ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంటుతో వాకబు చేయించాడు. అటువంటి దేం లేదనీ, తోటమాలికి అసలు కూతురే లేదనీ తేలింది.

"మిస్ బ్యూటీ" లుగా ఎన్నికయిన వారి నెందరినో తీసుకొచ్చి అంగాంగ ప్రదర్శన చేయించాడు. వారి నొకమారు చూసి తల దించుకుంటున్నాడే కాని, ఏ మాత్రం చలనం లేదు. చివరికి బ్లూ ఫిల్ము లనుకూడా ప్రదర్శించారు, రాకుమారుడి ముందు. అయినా లాభం లేకపోయింది.

రాజుకు అనుమానం వచ్చి పేరు పొందిన సెక్స్ స్పెషలిస్టులతో పరీక్ష చేయించాడు. రాకుమారుడికి మానసిక లోపమే కానీ, శారీరక లోప మేం లేదని తేల్చారు వారు.

మరయితే ఏం చేయాలని రాజు పెద్ద పరేషాన్ లో పడిపోయాడు. ఆ తరవాత మంత్రిపై కోపగించుకున్నాడు. "ఈ సమస్యకు వారం రోజుల్లోగా పరిష్కారం సూచించక పోతే తల తీయించి కోట గుమ్మానికి వేలాడదీయిస్తా" నని వార్నింగిచ్చాడు. మంత్రి ఆలోచనలతో బుర్ర బద్దలు కొట్టుకుని, ఎందరో రసిక మేధావులను సంప్రదించి ఒక ఉపాయం ప్రతిపాదించాడు. అదేమంటే రాకుమారున్ని దేశాటనకు పంపించడం.

ఇంకేముంది యువరాజు ఒక సూటుకేసు నిండా ట్రావెలర్ చెక్కులు తీసుకుని బయలుదేరాడు. ఎన్నో దేశాలు తిరుగుతూ చివరికి ఒక దేశానికి వచ్చి ఎంతో ఆశ్చర్య పడ్డాడు. ఎందుకంటే ఎన్నో రకాల కల్చర్ అంతా ఆ దేశంలో ఉంది. ఆ దేశాన్ని క్షుణ్ణంగా చూడాలని ఒక్కొక్క రాష్ట్రాన్ని సందర్శిస్తున్నాడు తీరిగ్గా.

అన్నింటికన్నా ఒక రాష్ట్రం రాకుమారున్ని ఎంతో ఆకర్షించింది. ఒంటినిండా బట్టలు చుట్టుకున్న ఆడపిల్లలు చాలా అందంగా కనిపించారు. ఆ రోజు కాలక్షేపానికి అక్కడి ఒక సినిమాకు వెళ్ళాడు.

ఒక్కో దృశ్యం చూస్తుంటే అనుభూతెరగని అతని స్తబ్ధ హృదయంలో సంచలనం!

ఒంటినిండా బట్టలతో వానలో తడిసిన కథానాయికను చూస్తుంటే ఆడవాళ్ళలో ఇన్ని ఒంపులున్నాయా అని ఆశ్చర్య పడ్డాడు. పాటలచిత్రీకరణలో కథానాయిక వేస్తున్న స్టెప్స్ అతనిలో తీయని రాగాన్ని మీటాయి. ఆమె పైట కొంగు జారినప్పుడు కనిపించిన అందాలు అతని కళ్ళలోంచి దూసుకెళ్ళి హృదయానికి తాకాయి. ఇంకో చోట కథానాయిక మంచంపై బోర్లా పడుకుని, తలగడను గుండెల కదుముకుని ఏదో పుస్తకం చదువుతూ కాళ్ళను పైకెత్తి గాలిలో కదిలిస్తున్నప్పుడు చీర పొరలు తొలగి వచ్చాయి పిక్కలు. ఇక చూడలేక పోయాడు రాకుమారుడు.

వెంటనే లేచి హోటలు కొచ్చి, సూటకేసు తీసుకుని తన దేశానికి పయనమై వెళ్ళి తండ్రి కనిపించగానే అడిగిన మొదటి మాట తనకు పెళ్ళి చేసెయ్యమని.

ఆశ్చర్యానందంతో రాజుకు గొంతు పెగల్లేదు.

రాకుమారున్ని వెన్నంటి పోయిన ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంటు వారు, రాకుమారునిలో కలిగిన మార్పుకు కారణాలు తెలుపుతూ సమర్పించిన నివేదికను చూసి "థాంక్స్ టు తెలుగు ఫిల్మ్స్" అనుకున్నాడు మహారాజు. ★